సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025

కనికరించరూ..!



కన్నబిడ్డ వృద్ధాప్యంలో తమ బాగోగులు చూడకపోవడంతో కలెక్టరేట్ గుమ్మం ఎక్కిన దీనురాలు ఆమె. పేరు వై.సరోజ. ఎస్.రాయవరం మండలం జేవీ పాలెం గ్రామం నుంచి వచ్చారు. తన కొడుకును మందలించి వృద్ధాప్యంలో ఉన్న తన భర్తను, తనను ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు. గతంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చానని, ఏడాది కాలంగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన చెందారు. మండలంలో అధికారులు కనీసం స్పందించడం లేదని, వారికి కనువిప్పు జరగాలంటే కలెక్టరమ్మ తమ గ్రామానికి వచ్చి సమస్య పరిష్కరించాలని, అంతవరకు కదిలేది లేదంటూ ఆమె పీజీఆర్ఎస్ వేదిక వద్ద భైఠాయించారు. పోలీసులు ఆమెను బయటకు తరలించి ఎస్.రాయవరం తహసీల్దార్, ఎస్సైలను కలవమని చెప్పి పంపించారు. ఆమె కలెక్టరేట్ బయట కొంతసేపు రోదించి వెళ్లిపోయారు. -తుమ్మపాల

న్యూస్‌రీల్

డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,134 పోస్టుల భర్తీ

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ-2025లో భాగంగా 1,139 పోస్టులకు ఎంపిక జాబితా విడుదల చేసినట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. ఐదు ఉర్దూ పోస్టులకు రోస్టర్ విధానం ప్రకారం అభ్యర్థులు లేకపోవడంతో 1,134 పోస్టులు భర్తీకానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో పాటు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 19న అమరావతిలో జరగనున్న సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియామక పత్రాలు అందజేస్తారన్నారు. అనంతరం రెండు రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఉంటుందని తెలిపారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్ (9440484917, 9177292969, 9618584051) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18న అమరావతి వెళ్లేందుకు వీలుగా ఉక్కునగరంలో గల విశాఖ విమల స్కూల్ నుంచి ఉదయం 7.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఆ సమయానికి అభ్యర్థులంతా విశాఖ విమల స్కూల్ వద్దకు చేరుకోవాలని డీఈవో కోరారు.

హాసిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన విద్యార్థిని తల్లి



ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేస్తున్న మృతి చెందిన హాస్టల్ విద్యార్థిని తల్లి నాగమణి

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, వేములపూడి బీసీ వసతిగృహంలో తన కుమార్తె హాసిని మరణించిన ఉదంతంపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని విద్యార్థిని తల్లి నాగమణి ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేశారు. కడుపు నొప్పితో బాధ పడుతున్న విషయం తన కుమార్తె హాస్టల్ సిబ్బందికి తెలియపరిచినా తనకు చెప్పలేదని బాధితురాలు ఆర్డీవోకు వివరించారు. రాత్రి కడుపు నొప్పి వస్తే శుక్రవారం ఉదయం వరకు హాస్పిటల్‌కు తీసుకువెళ్లకపోవటం వల్ల తన కుమార్తె చనిపోయిందని కంటతడి పెట్టారు. అదే రాత్రి హాసిని ఉంటున్న రూమ్‌లోకి పాము వస్తే బయట వారితో కొట్టించారని తన చిన్న కుమార్తె చెప్పిందని తెలియజేశారు. కుటుంబ సభ్యుల సమక్షంలో బహిరంగ విచారణ జరపాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్షరమే ఆయుధం







పత్రికా స్వేచ్ఛను అణగదొక్కడం అవివేకం

పత్రికలనేవి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయి. అటువంటి పత్రికా వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్ష సాధించడం దారుణం. రాజకీయ పార్టీ నాయకుడి ప్రెస్‌మీట్‌ను వార్త రూపంలో రాస్తే పాత్రికేయుడిపైన, సాక్షి ఎడిటర్‌పైన కేసులు నమోదు చేయడం చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. పత్రికా వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. కూటమి ప్రభుత్వం విష సంస్కృతికి తెర లేపుతోంది. భావ ప్రకటన స్వేచ్ఛను హరించాలని చూడటం మానుకోవాలి. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను.

-కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్యే

మీడియా గొంతు నొక్కేయడం తగదు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసమర్థపాలన కొనసాగుతుంది. మాట వినని అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారు. పచ్చపత్రికలు ఈ వాస్తవాలను ఎలాగూ ప్రజలకు చూపించరు. సాక్షి పత్రిక మాత్రమే నిర్భయంగా నిజాలను ప్రజలకు చేరవేస్తుంది. వీటిని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక సాక్షి పత్రికపై కేసులు నమోదు చేయడం, ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు అందించడం రాజ్యాంగ విరుద్ధం. పత్రికల గొంతునొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడమే. అలాంటి ప్రభుత్వాలు ఎంతోకాలం మనుగడ సాధించలేవని చరిత్ర చూస్తే తెలుస్తుంది.

- మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త

మిడిసి పడుతున్న పసిడి



రోజురోజుకూ పెరుగుతున్న పుత్తడి ధర

- 10 గ్రాముల ధర రూ.1.11 లక్షల పైమాటే..
- ఇప్పట్లో రూ.లక్ష దిగువకు వచ్చే సూచనలు లేవంటున్న వ్యాపారులు
- అదే బాటలో దూసుకుపోతున్న వెండి
- ధరలు పెరిగినా మార్కెట్ జోరు తగ్గలేదు



అనకాపల్లి మెయిన్‌రోడ్డులో బిజీగా ఉన్న బంగారం దుకాణం



విశాఖలో కొనుగోలుదారుల సందడి

సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి: పసిడితో భారతీయులకు ఉన్న అనుబంధం మరే దేశంలోనూ కనిపించదు. చేతిలో కొద్దిగా డబ్బులు కనిపిస్తే.. వెంటనే కొనుగోలు చేసేది బంగారాన్నే. ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా.. పుత్తడి కొంటే.. శుభసూచకమని అంటుంటారు. అందుకే స్వర్ణం.. సమస్తమయమైపోయింది. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్ నేపథ్యంలో రోజురోజుకీ పసిడి ధర పైపైకి ఎగబాకుతూ.. ఆల్‌టైమ్ హై రేట్‌ని నమోదు చేస్తోంది. ఒకప్పుడు 10 గ్రాముల ధరతో ఇప్పుడు గ్రాము కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి. వారం రోజులుగా ఎగబాకుతున్న బంగారాన్ని చూసి.. వెండి కూడా అదే బాటలో దూసుకుపోతోంది. లక్ష రూపాయల కంటే దిగువకు బంగారం ధర దిగే రోజులు ఇప్పట్లో కనిపించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

బంగారానికి ఇంత వన్నె ఎందుకో..?

పుత్తడి ఎంత ఉన్నా సగటు వ్యక్తికి మోజు తీరడం లేదు. తన శక్తి మేరకు బంగారాన్ని సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. అసలు బంగారానికి ఇంత వన్నె ఉండటానికి కారణం అంతర్జాతీయ కరెన్సీకి ప్రత్యామ్నాయం కావడమే. ఒక దేశం జారీ చేసిన నోట్లు చెల్లకపోవడం. వాటి విలువ క్షీణించడం ఉంటుంది. కానీ బంగారానికి అలాంటి బేధాలేమీ లేవు. ఎప్పుడైనా ఎక్కడైనా ఎంతో కొంత ధరకు చలామణీ అవుతుంది. అందుకే స్వర్ణానికి అంత కళ. ధర తగ్గినా పెరిగినా కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు.

పెట్టుబడి విషయంలోనూ బంగారమే..!

రోజు రోజుకీ ధర పెరుగుతూ వస్తున్నా బంగారం కొనుగోలు విషయంలో మాత్రం ప్రజలు అస్సలు తగ్గేదే..లే అంటున్నారు. ఎందుకంటే ఇంట్లో పసిడి ఎంత ఉంటే అంత ఎక్కువ సొమ్ము ఉన్నట్లుగా భావిస్తారు. వాస్తవానికి బంగారం నిరర్థక ఆస్తి. ఎంతో కష్టించి సంపాదించిన సొమ్ము బంగారంగా మార్చితే బీరువాల్లోనూ, బ్యాంకు లాకర్లలోనూ భద్రంగా ఉంచడం తప్ప... మరో ప్రయోజనం ఏంటి..? భవిష్యత్తులో ధర పెరిగి, పెరిగిన ధరకు దాన్ని విక్రయిస్తేనే లాభం. మనకు తెలిసినంత వరకూ బంగారం కొనడమే కానీ.. విక్రయించడమన్నది అరుదు. దీని బదులు వాటిని ఉత్పత్తి కార్యకలాపాలకు వెచ్చిస్తే సంపద సృష్టి జరుగుతుంది. మన దేశంలో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయడంలో బంగారం మూడో స్థానాన్ని ఆక్రమించింది. ముడిచమురు, క్యాపిటల్ గూడ్స్ తర్వాత అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న సరకు బంగారమేనన్నది విస్మయపరిచే అంశం. ఇటీవల కాలంలో మనదేశంలో బంగారం కొనుగోళ్లు అధికమై.. నగదు పొదుపు మొత్తాలు తగ్గిపోతున్నాయి. గృహస్తులు ఇతరాలపై ఒక్క శాతం పెట్టుబడులు పెడుతుండగా బంగారంపై మాత్రం ఆరున్నర రెట్లు ఎక్కువ మొగ్గు చూపుతుండటం విశేషం.

తగ్గేదేలే అంటున్న పుత్తడి

గత వారం రోజులుగా బంగారం ధర తగ్గేదేలే అన్నట్లుగా దూసుకుపోతోంది. ఈ నెల 8వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,380 ఉండగా.. 9వ తేదీన రూ.1,10,290కి చేరుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.1.10 లక్షలకు తక్కువ కాలేదు. వెండి కూడా ధగధగ మెరిసిపోతోంది. ఈ నెల 8న కిలో వెండి ధర రూ.1.37 లక్షలు ఉండగా.. 15వ తేదీ నాటికి రూ.6 వేలు పెరిగి రూ.1.43 లక్షలకు చేరుకుంది. అంటే రోజుకు దాదాపు రూ.1000 చొప్పున పెరుగుతూ వస్తోంది.

గత వారం రోజులుగా 10 గ్రాముల బంగారం, కిలో వెండి ధరలు

తేదీ	24 క్యారెట్ల బంగారం	22 క్యారెట్ల బంగారం	కిలో వెండి
8- సెప్టెంబర్	1,08,380	99,350	1,37,000
9- సెప్టెంబర్	1,10,290	1,01,100	1,40,000
10- సెప్టెంబర్	1.10.510	1,01,300	1,40,000
11- సెప్టెంబర్	1,10,510	1,01,300	1,40,000
12- సెప్టెంబర్	1,11,280	1,02,000	1,42,000
13- సెప్టెంబర్	1,11,170	1,01,900	1,43,000
14- సెప్టెంబర్	1,11,170	1,01,900	1,43,000
15- సెప్టెంబర్	1,11,060	1,01,800	1,43,000

కొనుగోళ్లు తగ్గినా.. మార్కెట్ దూసుకుపోతోంది



టెక్స్‌టైల్స్ మార్కెట్ 15 నుంచి 20 శాతం పడిపోయింది. బంగారం మార్కెట్ కూడా 15 నుంచి 20 శాతం పడిపోయింది. మార్కెట్ విలువ మాత్రం బంగారం విషయంలో ఏమాత్రం తగ్గలేదు. చైనా, భారత్ వంటి దేశాలు బంగారాన్ని కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. గతంలో పసిడి ధర మూడు నాలుగు రోజులకోసారి మారేది. ఇప్పుడు ఒక పూట ఉన్న రేటు మరో పూటకు ఉండటం లేదు. బులియన్ మార్కెట్ కూడా అంచనా వేయలేకపోతోంది. పెట్టుబడుల విషయంలోనూ బంగారానికి మంచి డిమాండ్ ఉంది. బంగారంతో వెండి పోటీ పడుతోంది. బ్యాటరీ కార్లలో వెండి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ధరల పెరుగుదలకు ఓ కారణమని చెప్పవచ్చు.

– కంకటాల మల్లికార్జునరావు, ఫ్యాప్సీ పాస్ట్ ప్రెసిడెంట్, విశాఖపట్నం


పెట్టుబడి వస్తువుగా పరిగణిస్తున్నారు



ప్రజల్లో బంగారం కొనుగోలు శక్తి పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో తులం బంగారం రూ. లక్ష ఉంటే దశల వారీగా పెరిగింది. ప్రజల వద్ద ఉన్న నగదును బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది వ్యక్తులు ఇతరులకు నగదు వడ్డీకి ఇస్తే ఇబ్బందులు పడుతున్నామని గ్రహించి, బంగారం ముద్ద రూపంలో కొనుగోలు చేసి ఇంటిలో భద్రపర్చుకుంటున్నారు.

-కర్రి మల్లేశ్వరరావు, బంగారం వ్యాపారస్తుడు, అనకాపల్లి

ధర పెరిగినా జోరు తగ్గలేదు



గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసినవారు ఇప్పుడు వెనక్కు తగ్గారు. ప్రస్తుతం ఆ రంగం జోరు తగ్గడంతో బంగారంపై పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని పెట్టుబడిదారులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రజలు బంగారం, వెండిపై పెట్టుబడులు పెట్టేందుకు మరింత ఆసక్తి చూపుతారని అంచనా వేస్తున్నాం. బంగారం, వెండి ధర పెరిగినా అమ్మకాలపై ఎటువంటి ప్రభావం లేదు.

-పీలా మోహన్‌రావు, బంగారం వ్యాపారస్తుడు, అనకాపల్లి

పట్టువదలని గంగపుత్రులు

- పోలీసులు చుట్టుముట్టినా రెండో రోజూ కొనసాగిన దీక్ష
- బల్క్‌డ్రగ్ పార్క్ కంటే ఉరే సరి అంటూ నినాదాలు
- మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన
- హోం మంత్రి సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టీకరణ



రాజయ్యపేటలో రెండో రోజు ఆందోళన కొనసాగిస్తున్న మత్స్యకారులు



గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులు

నక్కపల్లి: మత్స్యకారుల పట్టు సడలలేదు. బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం రోజంతా ఉద్రిక్తత మధ్య గడిపిన రాజయ్యపేట మత్స్యకారులు రెండో రోజు కూడా ఆందోళన కొనసాగించారు. బల్క్‌డ్రగ్ పార్క్ కంటే ఉరే సరి అంటూ మెడలో ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు. మత్స్యకారుల పొట్ట కొట్టే బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిరాహార దీక్షకు యత్నించడం, అనుమతి నిరాకరించిన పోలీసులు భవిష్యత్ కార్యాచరణకు సమావేశం కావడాన్ని అడ్డుకోవడం తెలిసిందే. 14 మందిపై కేసులు పెట్టడమే కాక ఆదివారం రాత్రి భారీ సంఖ్యలో పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. సోమవారం కూడా నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్.రాయవరం సీఐ ఎల్.రామకృష్ణ, పాయకరావుపేట సీఐ అప్పన్న, ఎస్‌ఐ సన్నిబాబు, ట్రెయినీ ఎస్‌ఐ సాహిబ్ అంజు తదితరుల ఆధ్వర్యంలో వందలాది మంది పోలీసులు రాజయ్యపేటలో మోహరించారు. తాము బల్క్‌డ్రగ్ పార్క్ అడ్డుకోలేదని, ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడలేదని, అయినప్పటికీ అంతమంది పోలీసులు మోహరించి ఎక్కడకూ కదలకుండా అడ్డుకుంటున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ వల్ల తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ ఆందోళనకు మద్దతు తెలిపి మత్స్యకారులతోపాటు నిరాహారదీక్షలో కూర్చున్నారు.

హోం మంత్రి సమాధానం చెప్పాల్సిందే..

ఎన్నికల్లో ప్రచారానికి వచ్చినపుడు వంగలపూడి అనిత ఓట్లు వేసి గెలిపించాలని కోరారని, ప్రమాదకర రసాయన పరిశ్రమలు రాకుండా గ్రామాన్ని కాపాడతానని హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తమ గోడు వినేందుకు కూడా ఆసక్తి చూపడం లేదని మత్స్యకారులు వాపోయారు. ఆమెను నమ్మి ఓట్లేసినందుకు బాగానే రుణం తీర్చుకుంటున్నారన్నారు. హోంమంత్రి తమ గ్రామానికి వచ్చి సమాధానం చెప్పాలన్నారు. ఆమె ఆదేశాలు లేకుండా వందలాది మంది పోలీసులు గ్రామంలోకి వస్తారా అని ప్రశ్నించారు. మంత్రికి వ్యతిరేకంగా మహిళలు నినాదాలు చేశారు. తామంతా ప్రాణాలకు తెగించేందుకు సిద్ధంగా ఉన్నామని కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా నిరాహార దీక్ష కొనసాగిస్తామన్నారు. ప్రాణాలు కాపాడుకుంటామన్నారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలి



ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకోవాలి. బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటయితే మత్స్యకారుల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. పార్టీలకతీతంగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. ఈ ప్రాంత ఆడబిడ్డగా మంత్రి అనిత ఈ విషయాన్ని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి మత్స్యకారులకు న్యాయం చేయాలి.

– గోసల కాసులమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు

పార్టీ కంటే గ్రామస్తుల ప్రాణాలే ముఖ్యం



బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలని హోం మంత్రి అనితను కోరాం. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మాకు పార్టీ కంటే గ్రామస్తుల ప్రాణాలే ముఖ్యం. బల్క్‌డ్రగ్ పార్క్ వల్ల రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బంది పడతాం. గ్రామస్తులతోపాటు ఎటువంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నాం. శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే కేసులు పెట్టడం తగదు.

-పిక్కి గంగరాజు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు

హోం మంత్రిదే బాధ్యత



మా ఆందోళనకు హోం మంత్రి అనిత వచ్చి సమాధానం చెప్పాల్సిందే. మీ ఆడపిల్లను గెలిపిస్తే అండగా ఉంటానని నమ్మించారు. ఇప్పుడు నిలబెట్టుకోవాలి కదా. రెండు వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే ఏం న్యాయం చేశారు. ఇంత వరకు మంత్రి మా గ్రామంలోకి రాలేదు. మా ప్రాణాలకేమైనా జరిగితే హోం మంత్రి బాధ్యత వహించాలి.

-కాశీరావు, మత్స్యకారుడు, రాజయ్యపేట

సీపీఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం



అప్పలరాజు ఇంటి ముందు పోలీసుల కాపలా

నక్కపల్లి: బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని కోరుతూ రాజయ్యపేటలో మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును సోమవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో అప్పలరాజు తన ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసులను కాపలా ఉంచారు. కొద్ది నెలలుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు అప్పలరాజు తదితరులు సంఘీభావం తెలుపుతున్న విషయం తెలిసిందే. ఆదివారం వారి దీక్షలో అప్పలరాజు పాల్గొన్నారు. దీంతో పోలీసులు అప్పలరాజుకు 41 నోటీసులు జారీ చేసి కేసులు నమోదు చేశారు. సోమవారం ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఉద్యమాలను అణగదొక్కాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అప్పలరాజు ఆరోపించారు. మత్స్యకారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిశ్రమల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. అప్పలరాజును అడ్డుకోవడంతో రాజయ్యపేటలో జరిగిన ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్, ఎం.సత్యనారాయణలు పాల్గొని సంఘీభావం తెలిపారు.

35మంది మత్స్యకారులపై కేసులు నమోదు

నక్కపల్లి: రాజయ్యపేట సమీపంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటును విరమించుకోవాలంటూ ఆది, సోమవారాల్లో అనుమతులు లేకుండా ధర్నా చేస్తున్న 35 మంది మత్స్యకారులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. తొలిరోజు 14 మందిపై కేసు పెట్టామని, సోమవారం కూడా పోలీసుల అనుమతి లేకుండా నిరాహారదీక్షను కొనసాగించి, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన 21 మంది మత్స్యకారులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మెడికల్ కాలేజీ సాధనకు ఉద్యమ కార్యాచరణ

- ఈనెల 18న శాంతియుత నిరసన
- దశలవారీగా ఉద్యమం ఉధృతం
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ టౌన్ సీఐకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం: మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించేలా ఒత్తిడి తెచ్చేందుకు దశలవారీగా ఉద్యమానికి కార్యాచరణ రూపొందించామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతానికి మెడికల్ కాలేజీ అత్యంత అవసరమన్నారు. ప్రజాభీష్టాన్ని శాసనసభ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈనెల 18న మున్సిపల్ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ విధిగా హాజరై మన నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలన్నారు. మైదాన, గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్యం అందుబాటులోకి రావాలంటే మెడికల్ కాలేజీ అవసరమన్నారు. పీపీపీ విధానం వల్ల కాలేజీ ప్రైవేటుపరమైతే అన్ని రకాల వైద్యసేవలకు డబ్బు చెల్లించాల్సి వస్తుందన్నారు.

అనుమతి కోరుతూ సీఐకి వినతి

సమావేశం ముగిసిన వెంటనే పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ గోవిందరావును కలిసి ఈనెల 18న చేపడుతున్న శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీలు సుర్ల గిరిబాబు, అప్పలనర్స, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సర్వేశ్వరరావు, గజ్జలపు మణికుమారి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ మండల అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, ఫణి శాంతరామ్, నాగేశ్వరరావు, చిటికెల రమణ, తదితరులు ఉన్నారు.

వెంటాడుతున్న యూరియా కష్టాలు

- గరిశింగిలో అరకొర సరఫరాతో రైతుల అవస్థలు
- స్వల్ప తోపులాటతో పోలీసుల రాక
- వారి పర్యవేక్షణలో ఎరువుల పంపిణీ



దేవరాపల్లి: గరిశింగి రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

దేవరాపల్లి: అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. తాజాగా గరిశింగిలో సోమవారం అరకొరగా యూరియా అందుబాటులోకి రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో వారి మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో మహిళా, వృద్ధ రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గరిశింగి రైతు సేవా కేంద్రం పరిధిలో 270 యూరియా బస్తాలు సోమవారం అందుబాటులోకి రాగా వీటిలో 80 బస్తాలను వాలాబు పంచాయతీకి, మరో 80 బస్తాలను చినగంగవరం గ్రామానికి కేటాయించారు. మిగిలి ఉన్న 110 యూరియా బస్తాల కోసం గరిశింగితోపాటు డొర్రి చెరువు, కించుమండ, కొత్తూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. రైతులు రెట్టింపు సంఖ్యలో ఉండగా సరఫరా మాత్రం అరకొరగా ఉండటం రైతుల మధ్య స్వల్ప తోపులాటకు దారితీసింది. స్థానిక వ్యవసాయ సిబ్బంది పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వి.సత్యనారాయణ తక్షణమే తన సిబ్బందితో గరిశింగి చేరుకున్నారు. టోకెన్‌ల ప్రకారం రైతులను క్యూలైన్‌లో ఉంచి యూరియాను పంపిణీ చేయించారు. అరకొరగా యూరియా సరఫరా చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేయడం తగదని ప్రభుత్వ తీరుపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక యూరియా బస్తా కోసం

మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా

సంయుక్త మీనన్ సందడి



బీచ్‌రోడ్డు: ప్రముఖ నటి సంయుక్త మీనన్ సోమవారం నగరంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, గతంలో ఇక్కడ షూటింగ్‌లలో పాల్గొన్నట్లు గుర్తు చేసుకున్నారు. విశాఖ అందమైన నగరమన్నారు. విశాఖ బీచ్‌లో గడపడమంటే ఎంతోఇష్టమన చెప్పారు. తన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఓ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు.

3,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సారా బట్టీ వద్ద ఉన్న పాత్రలను స్వాధీనం చేసుకున్న సీఐ రేవతమ్మ, సిబ్బంది

నర్సీపట్నం: నర్సీపట్నం, కోటవురట్ల పోలీసు స్టేషన్ల సరిహద్దు గ్రామాల్లోని సారా బట్టీలపై రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మెరుపుదాడులు నిర్వహించారు. బంగారయ్యపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో దాడులు నిర్వహించి సారా బట్టీలను ధ్వంసం చేశారు. 3,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని సీఐ తెలిపారు. నాటు సారా తయారీకి వినియోగించే పాత్రలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా అమ్మినా, తయారు చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ దాడుల్లో రూరల్ ఎస్ఐ రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు

బావిలో వ్యక్తి మృతదేహం



బావిలో తేలిన మృతదేహం

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాంనగర్‌లో సోమవారం ఓ బావిలో వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. బావి పక్కన ఎర్రని బ్యాగు ఉంది. అందులో వివరాలను బట్టి మృతుడు ట్యాక్సీ డ్రైవర్‌గా భావిస్తున్నారు. బావి లోపల తేలిన మృత దేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక మృతికి మరేదైనా కారణం ఉందా? అన్న విషయాలు తెలియరాలేదు. దీనిపై సోమవారం రాత్రి వరకు పట్టణ పోలీసులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్షేత్ర స్థాయి పర్యటనతోనే అర్జీల పరిష్కారం

అధికారులకు జేసీ జాహ్నవి ఆదేశం ■ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 313 అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు, జిల్లా అధికారులు

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు డీఆర్వో వై.సత్యనారాయణరావు, పీజీఆర్ఎస్ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే అర్జీలు రీఓపెన్ కాకుండా నివారించవచ్చన్నారు. మొత్తం 313 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు పెట్టినా తల్లికి వందనంపై స్పష్టత లేదు

తన భార్య మృతి చెందడంతో తల్లికి వందనం పథకం నిలిపివేశారని, తండ్రిగా తన బ్యాంక్ ఖాతాను జోడించి పథకం వర్తింపజేయాలని కోరుతూ మూడు సార్లు అర్జీలు అందజేసినా ఎటువంటి ప్రయోజనం లేదని పాయకరావుపేట మండలం మంగవరం గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వరరావు పీజీఆర్ఎస్‌లో మళ్లీ అర్జీ అందజేశారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఒక్కరికి కూడా పథకం మంజూరు చేయలేదన్నారు. సచివాలయ సిబ్బంది వచ్చి సంతకం తీసుకుని వెళ్లిపోతున్నారని, నగదు మాత్రం అందించడం లేదని వాపోయారు. గతంలో చేసిన అర్జీలు చూపించడంతో అర్జీ నమోదు చేయకుండా రూం.6కు వెళ్లాలంటూ సూచిస్తున్నారని, అక్కడికి వెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ పథకాలపై అర్జీలకు నిరాకరణ

తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులకు అధికారులు పెడుతున్న షరతులు విసిగిస్తెప్పిస్తున్నాయి. వెంట తెచ్చుకున్న బ్యాగులు, చేతిలో ఫిర్యాదులను పరిశీలించిన తరువాతనే లోపలికి అనుమతిస్తున్నారు. ప్రధాన ద్వారం వద్ద క్యూలో నిల్చున్న అర్జీదారుల వద్ద ఉన్న ఫిర్యాదు స్వరూపం ఆధారంగా ఆయా శాఖలకు రిఫర్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వ పథకాలైన తల్లికి వందనం, పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి వాటిపై అర్జీలను పీజీఆర్ఎస్‌లో నమోదు చేయకుండా గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయం(రూమ్ నెం.6)కు వెళ్లాలంటూ అర్జీదారులను పంపించేస్తున్నారు. పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించడానికి వస్తే ఇలా మరో చోటకు వెళ్లమనడమేమిటని అర్జీదారులు ప్రశ్నించినా ఫలితం లేకుండాపోయింది.

పింఛన్ ఇప్పించండమ్మా..



భర్త చనిపోయి పిల్లలపై ఆధారపడి జీవిస్తున్న తనకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు బొగాది మహాలక్ష్మి వేడుకుంది. కుమారుడి సహాయంతో కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేసింది. భర్త చనిపోయిన మహిళలకు ఇటీవల ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసినప్పటికీ తనకు ఇవ్వలేదని, సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని వాపోయింది. పింఛన్ ఇప్పించాలని ఎస్‌డీసీ సుబ్బలక్ష్మిని వేడుకుంది.

–వృద్ధురాలు బొగాది మహాలక్ష్మి

ఫీజు కట్టి ఆదుకోండి



తమ కళాశాల ఫీజు కట్టి ఆదుకోవాలంటూ సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు తరుణ్, జీవన్ పీజీఆర్ఎస్‌లో అర్జీ చేసుకున్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న తాము ఫీజు కట్టుకోలేని స్థితిలో ఉన్నామని, డిగ్రీ పూర్తి చేసే వరకు కళాశాల ఫీజుకు భరోసా కల్పించాలంటూ ఎస్‌డీసీ సుబ్బలక్ష్మిని వేడుకున్నారు. ఆమె దివ్యాంగుల వద్దకు వచ్చి అర్జీ స్వీకరించారు.

– విద్యార్థులు తరుణ్, జీవన్

ఎస్పీ కార్యాలయానికి 40 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: చట్ట పరిధిలో సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు 40 అర్జీలు వచ్చాయని, భూతగాదాలు-23, కుటుంబ కలహాలు-4, మోసాలకు సంబంధించినవి-3, వివిధ విభాగాలకు సంబంధించినవి-10 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పూర్తి విచారణ చేసి, పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

క్షతగాత్రుడు వరహాలనాయుడికి పరామర్శ



ఎన్టీఆర్ ఆస్పత్రిలో వరహాల నాయుడిని పరామర్శిస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్

అనకాపల్లి: జిల్లాలో వి.మాడుగుల మండలం ఎం.కృష్ణాపురంలో గొర్రెలు, మేకల పెంపకందారుడు కోళ్ల వరహాలనాయుడిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు భూసమస్య నేపథ్యంలో దాడి చేసి గాయపరిచారు. దీనిపై ఈ నెల 11న నాయుడు కుటుంబ సభ్యులు అక్కడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ పటించుకోలేదని జిల్లా గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం చైర్మన్ గంటా శ్రీరామ్ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడు కోళ్ల వరహాలనాయుడిని సోమవారం సంఘం సభ్యులు పరామర్శించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నాయుడుకు అండగా నిలబడుతూ ఎస్పీ తుహిన్ సిన్హాకు వినతి పత్రం అందజేశారు. నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని, లేని పక్షంలో ఈ నెల 18న మాడుగుల తహసీల్దార్ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, ఎం.కృష్ణాపురం మాజీ సర్పంచ్ మొల్లి అప్పారావు, జిల్లా కార్యదర్శి గోకాడ దేముడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

‘తాండవ’లో పుష్కలంగా నీటి నిల్వలు



తాండవ ప్రాజెక్టులో పుష్కలంగా నీటి మట్టం

నాతవరం: తాండవ రిజర్వాయరులో నీటి మట్టం నిలకడగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగుకు పంట కాలువల ద్వారా ఆగస్టు 10న నీటిని విడుదల చేశారు. ఆ సమయానికి తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 372.0 అడుగులు ఉండేది. ఆ రోజు నుంచి ప్రధాన కాలువల ద్వారా రోజు ఒక్కంటికి 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. తరచూ వర్షాలు కురియడంతో తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గకుండా పెరుగుతుంది. సోమవారం సాయంత్రానికి తాండవలో నీటి మట్టం 375.5 అడుగులు ఉంది. ప్రస్తుతం పంట కాలువల ద్వారా విడుదల చేసే నీరు కంటే ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో అధికంగా రావడం వల్ల ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడం లేదని ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగుకు శివారు ఆయకట్టుకు సైతం సకాలంలో నీటిని సరాఫరా చేశామని, రైతులంతా పొదుపుగా నీటిని వాడుకోవాలని సూచించారు.

వెంటాడుతున్న యూరియా కష్టాలు

▶7వ పేజీ తరువాయి



గొలుగొండ: నాగాపురం గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేసున్న రైతులు

క్యూలైన్లలో గంటల కొద్ది పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. క్యూలైన్‌లో నిరీక్షణ చేసినా యూరియా దొరకక పలువురు రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఇప్పటికే పలుమార్లు అధికార్లు వచ్చి యూరియా కోసం పేర్లు నమోదు చేసుకున్నారని, సరిపడా యూరియ ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారని పలువురు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నాగాపురంలో రైతుల ఆందోళన

గొలుగొండ: యూరియా కొరత వలన రైతులు నాగాపురం గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కూటమి సర్కార్ రైతులకు న్యాయం చేయకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపించారు. గ్రామంలో వరి, పత్తి, కూరగాయాల తోపాటు ఇతర పంటలు వేయగా సకాలంలో యూరియాతోపాటు ఇతర ఎరువులు లేకపోవడం వలన పంటలు నాశనం అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. నాగాపురం పంచాయతీలో ఎంత వ్యవసాయ భూమి ఉంది.. ఎన్ని రకాల పంటలు సాగు చేస్తారు.. వారికి ఎంతమేర ఎరువులు అవసరం అని ఆలోచించుకోవద్దా అని నిలదీశారు. రైతులు యర్రా వరహాలు, పి.భూషణం, రామకృష్ణ, త్రినాథ్, నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో శ్రీరామ్

అల్లిపురం: ఎంవీపీకాలనీలో ఉంటున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ఖైవరపల్ల శ్రీరామ్(41) సూర్యాబాగ్‌లో గల ఒక హోటల్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం సూర్యాబాగ్‌లో గల రాఘవేంద్ర హోటల్‌లో ఆయన అద్దెకు తీసుకున్న గది నుంచి ఘాటైన వాసన రావడంతో సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ కొల్లి సతీష్, కానిస్టేబుళ్లు గది తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లే సమయానికి శ్రీరామ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. హోటల్ గదిలో దొరికిన లేఖలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రాసి ఉన్నట్లు తెలిపారు. సకాలంలో స్పందించి ఒకరి ప్రాణాన్ని రక్షించినందుకు గాను సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను సీపీ అభినందించారు.

బెల్టు షాపులతో పేదల జీవితాలు ఛిద్రం



మాడుగుల ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న, ప్రజలు

- గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోరా?
- మాడుగుల ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

మాడుగుల రూరల్: నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్టుషాపుల ఏర్పాటుతో పేదల జీవితాలు ఛిద్రమవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ధ్వజమెత్తారు. మాడుగుల ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ బెల్టుషాపులు నిర్వహిస్తూ పేదలు కష్టాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన లైసెన్స్ షాపులకు అనుబంధంగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలతో పాటు పాన్‌షాపులు, దాబాలు, టీ షాపుల్లో సైతం యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేపడుతున్నారన్నారు. ఎంఆర్‌పీ కంటే బెల్టుషాపుల్లో బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనధికార వేలం పాటలు నిర్వహించి, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బెల్టుషాపులు, అక్రమ మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం దేవరాపల్లి మండల కార్యదర్శి బి.టి.దొర, వంతల కేశవరావు, దాసు పాంగి మత్యరాజు, పాంగి విజయ, పార్టీ మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి, కె.భవానీ, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా

- తప్పనిసరిగా వేయించాలి
- జేసీ జాహ్నవి పిలుపు



గాలికుంటు వ్యాధి నిరోధక టీకా గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి, జిల్లా అధికారులు

తుమ్మపాల: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో పాడి రంగం అభివృద్ధికి అధికారులు నిర్ణీత సమయంలో టీకా కార్యక్రమం జరపాలని, గాలికుంటు వ్యాధి పూర్తిగా నిర్మూలించాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామమోహనరావు మాట్లాడుతూ జిల్లాలో 3,54,200 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయని, నెల రోజులపాటు టీకా కార్యక్రమం రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వైష్ణవ కృష్ణాష్టమి



భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేస్తున్న అర్చకులు



ఉపమాక ఆలయంలో వైష్ణవ కృష్ణాష్టమి పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

- ఉపమాకలో ఘనంగా ప్రారంభం
- యశోదగా గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం ఆలయంలో నిత్య పూజా కార్యక్రమాలు, బాలభోగ నివేదలు, నిత్య హోమాలు, తీర్థగోష్టి నిర్వహించారు. తర్వాత గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తికి యశోదాదేవి అలంకరణ చేశారు. యశోద అలంకరణలో ఉన్న అమ్మవారు కృష్ణ పరమాత్మకు ఉగ్గుపాలు పడుతూ ఉండే విశేష ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం ఆలయంలో విశేష అలంకరణలో ఉన్న యశోదాదేవి అమ్మవారికి, శ్రీదేవి భూదేవి సమేత కల్కి వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు, ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి విశేష పూజలు చేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం గరుడాద్రి పర్వతంపై కొలువైన మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం, విశేష ప్రసాద నివేదనలు, తీర్థగోష్టి నిర్వహించారు. కొండ దిగువన ఉన్న ఉత్సవమూర్తులకు నిత్య పూజలు, రాజభోగం, నిత్య సేవా కాలం, సాయంకాలారాధనలు పూర్తి చేశారు. స్వామివారికి పలు రకాల ప్రసాదాలను తయారు చేసి నివేదించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

● కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఆస్థాన మండపంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను, బుల్లి కృష్ణుడిని, స్వామి వారి పీఠంపై అధిష్టింపజేయనున్నారు. వెన్నతో కూడిన ఉట్టికి ప్రత్యేక ఆరాధనలు, అనంతరం ఏకాంతంగా ఉట్టికొట్టే సంబరాన్ని నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, రాజగోపాలాచార్యులు, శేషాచార్యులు, సాయి ఆచార్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కంచాలు కొట్టి మహిళల నిరసన



కంచాలతో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగుల కుటుంబీకులు అడ్మిన్ బిల్డింగ్ కూడలి పెద్ద ఎత్తున ధర్నాలో చేశారు. మహిళలు, ఉద్యోగులు కంచాలు కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు జీతాల చెల్లించామని కేంద్ర ఉక్కు మంత్రి ప్రకటించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉక్కు కార్మికులకు గత ఏడాదిగా పూర్తి జీతాలు చెల్లించకుండా యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. జీతాలు చెల్లించమని అడిగిన కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు బోనస్ చెల్లించే అంశంపై చర్చలు జరుగుతుంటే ఇక్కడ జీతాల చెల్లించకుండా వేధిస్తున్నారన్నారు. జిల్లా సీఐటీయూ నాయకులు ఎస్.రామారావు మాట్లాడుతూ జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై చర్యలు చేపట్టడం అత్యంత దుర్మార్గమన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించకుండా చూడాలి

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



ముత్రాస్ కాలనీ స్కూల్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

అనకాపల్లి: పంచాయతీల పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. కొత్తూరు పంచాయతీ పరిధిలో కొత్తూరు, ముత్రాస్ కాలనీల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తూరు పరిధిలో జిల్లా పరిషత్‌కు సంబంధించిన 12 ఎకరాల స్థలం ఉందని, ఇందులో మూడు ఎకరాలను ముత్రాస్ కాలనీ హైస్కూల్‌కు కేటాయించే విషయం పరిశీలిస్తున్నామని చెప్పారు. మిగిలిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని, దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టాలని ఆమె కోరారు. పట్టణ పరిధిలో జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని ఆర్డీవో కార్యాలయంగా మార్చారని, కొత్తూరులో కొత్తగా ఆర్డీవో కార్యాలయం నూతన భవనాన్ని ఏర్పాటు చేశారని, 10 రోజుల్లో కొత్త భవనంలోనికి ఆర్డీవో కార్యాలయాన్ని తరలించాలని ఆమె కోరారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బి.వి.సత్యవతి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ లక్ష్యం రూ.3 వేల కోట్ల టర్నోవర్



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తాతారావు

పాయకరావుపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) టర్నోవర్ రూ.3 వేల కోట్లకు పెంచాలన్న ధ్యేయంతో పని చేస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు తెలిపారు. పట్టణంలోని బ్యాంచిలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం రూ.2700 కోట్ల టర్నోవర్‌లో ఉందన్నారు. కొత్తగా భీమిలీ, ఆనందపురంతో పాటు అనకాపల్లి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో కూడా బ్యాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ఉన్న 92 పీఏసీఎస్‌లను కంప్యూటరీకరిస్తామన్నారు. తమలపాకు రైతులకు లక్ష రూపాయల రుణం అందిస్తున్నామని, దీనిని రూ.3 లక్షలకు పెంచుతామన్నారు. రైతులకు ఇతర అవసరాలకు కూడా జీరో వడ్డీతో రూ.2 లక్షలు వరకు క్రాప్ రుణం అందిస్తున్నామన్నారు. హౌసింగ్, ఎడ్యుకేషన్, మార్ట్‌గేజ్, ఖాళీ స్థలాలకు, చిన్న పరిశ్రమలకు కూడా రుణాలు మంజూరు చేస్తామన్నారు. పేదలకు గొర్రెలు, గేదెలు, పౌల్ట్రీ, డైరీల ఏర్పాటుకు 50 శాతం రాయితీపై నాబార్డు లింకేజ్ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. అతి తక్కువ రుణాలు కలిగి ఉండి చెల్లించలేని పేదలకు ఓటీఎస్ అమలు చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రైతులకు రూ.432 కోట్ల రుణాలు అందిమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరా శాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ, మేనేజరు కె.ఎల్ శిల్ప, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, నోడల్ ఆఫీసర్ ఎల్‌కేఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అనకాపల్లి టౌన్: తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వాణి జగదీశ్వరి, సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మహిళల ఆరోగ్యం మెరుగుపరచడం, తద్వారా కుటుంబాలను బలోపేతం చేయడమన్నారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో అవసరమైన అన్ని రకాల టెస్టులు చేస్తామన్నారు.

అప్పన్న సన్నిధిలో వీఎంఆర్డీఏ కమిషనర్



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న విశ్వనాథన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను అధికారులు అందించారు.

నూకాంబిక సన్నిధిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న మాధవ్ దంపతులు

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారి తరపున అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని మాధవ్‌కు అందజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొనే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 153 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,220	4,900
రెండో రకం	3,690	4,090
మూడోరకం	3,600	3,720

అనకాపల్లి సినిమాలు

రాజా	: మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5, బి పాజిటివ్-8, ఒ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్.9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్.08924–223595)ని సంప్రదించవచ్చు.



పాపయ్యసంతపాలెంలో పిల్లర్స్‌తో ఆగిన రైతు భరోసా కేంద్రం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతే రాజు. వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఉద్దేశంతో రైతు ముంగిటే అన్ని సేవలూ దొరికేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లు నిర్మించారు. విత్తు నుంచి విక్రయం వరకూ రైతుల అవసరాలన్నీ ఆర్బీకేల ద్వారానే నెరవేరేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని రైతు సేవా కేంద్రాలుగా మార్చి.. ఏ సేవలూ అందకుండా చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనకాపల్లి మండలంలో ఆర్బీకేల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.



మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పిల్లర్స్ వరకు నిర్మించిన రైతు భరోసా కేంద్రం

రైతు భరోసా కేంద్రాలపై అంతులేని నిర్లక్ష్యం!

- వలు గ్రామాల్లో 70 శాతం పూర్తయిన బిల్డింగ్‌లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో దాదాపు పూర్తి కావచ్చిన రైతు భరోసా కేంద్రం

అనకాపల్లి టౌన్: అన్నదాతే దేశానికి వెన్నెముక అని గుర్తించి గత ప్రభుత్వంలో చేపట్టిన ఆర్బీకేలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సగం అంతకు మించి పనులు జరిగి, తుది మెరుగుల కోసం నిరీక్షిస్తున్న చోట నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయీ విదల్చకపోవడంతో రైతులపై ఈ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిలువెత్తు నిదర్శనాలుగా ఆర్బీకే భవనాలు నిలుస్తున్నాయి.

24 కేంద్రాల్లో 11 వినియోగంలోకి..

మండలంలో 24 ఆర్బీకేల నిర్మాణానికి ప్రతిపాదించారు. తగరంపూడి, కుంచంగి, కూర్రం, సంపతిపురం, వెంకుపాలెం, బవులవాడ, ఊడేరు, మార్టూరు, రేబాక, గోపాలపురం, గొలగాం గ్రామాల్లో 11 భవనాల నిర్మాణం పూర్తి చేసి గత ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చింది. కోడూరులో 99 శాతం పనులు పూర్తయ్యాయి. కేవలం ఎలక్ట్రికల్ పనులు మాత్రమే పెండింగ్. ఇక సీహెచ్ఎన్ అగ్రహారం, మారేడిపూడి అక్కిరెడ్డి పాలెం, పిసినికాడ బీఆర్‌టీ కాలనీ, శంకరం, మామిడిపాలెం, సత్యన్నారాయణపురం, తుమ్మపాల మేజర్ పంచాయతీ కావడంతో మూడు ప్రదేశాలు, పాపయ్యపాలెంలలో కొన్ని భవనాలకు శ్లాబ్‌లు వేసి గోడలు కట్టగా, మరికొన్ని చోట్ల పునాదులు వేసి పిల్లర్స్‌ను కూడా పూర్తి చేశారు. చాలా భవనాల్లో 70 శాతం పనులు జరిగాయి. ఈలోగా ప్రభుత్వం మారడంతో రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఆర్బీకే భవనాలు పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే చెప్పొచ్చు.

ఊరు దాటాల్సిన పని ఉండేది కాదు!

ఉన్న ఊళ్లోనే రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలందించేందుకు గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పంటల సాగులో సూచనలు, సలహాలతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు అరకొరగా అందిస్తున్నారు. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల నుంచి కాకుండా సహకార సంఘాల ద్వారా పంపిణీ చేపట్టారు. తుమ్మపాలలో ఉన్న కొంత మంది రైతులు అనకాపల్లి అన్నపూర్ణ బ్యాంకు వద్దకు వచ్చి యూరియా తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రమబద్ధీకరణతో ఆర్బీకే సిబ్బందిని కూడా సర్దుబాటు చేశారు. రెండు, మూడు కేంద్రాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. దీంతో సిబ్బందికి పని భారం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న భవనాలను కూడా పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గతంలో అన్ని సేవలూ ఊళ్లోనే..

గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందాం. సాగుకు అవసరమైన అన్ని సేవలు ఉన్న ఊళ్లోనే అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. యూరియా కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. పంట చేతికొచ్చాక.. గిట్టుబాట ధర పరిస్థితేంటో భగవంతుడికే తెలియాలి. – ఎస్.వెంకట్రావు, రైతు, పాపయ్యపాలెం

ఉరుకులు.. పరుగులు

ఆర్బీకేల ద్వారా అందే సేవలు నానాటికీ తగ్గిపోతున్నాయి. గతంలో విత్తనాల నుంచి పంట చేతికొచ్చాక గిట్టుబాటు ధర వరకు అన్నీ ఆర్బీకేల్లోనే జరిగేవి. పంటలకు ఏమైనా తెగుళ్లు వచ్చాయని చెబితే అధికారులు వచ్చి చూసేవారు. ఇప్పుడు ఏ సమస్య వచ్చినా ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. – ఆర్.శ్రీనివాసయ్య, రైతు, తుమ్మపాల

ప్రభుత్వ ఉద్యోగులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



ఇన్‌చార్జ్ తహసీల్దార్ శాంతిభూషణరావుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

అనకాపల్లి: ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ, బకాయిపడ్డ డీఏలు ఇస్తామని చెప్పి, నేటికీ అమలు చేయలేదని ఏపీటీఎఫ్ అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు కొణతాల గణేష్, కె.సూర్యనారాయణలు ఆక్షేపించారు. ఈ మేరకు స్థానిక మెయిన్‌రోడ్డు తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శాంతిభూషణరావుకు సోమవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతున్నా.. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెమో నెం.57ను తక్షణం అమలు, 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటనతోపాటు అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు గణపతి, మునగపాక మండల అధ్యక్షుడు ఎం.వై.రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జూట్ బ్యాగుల పంపిణీ



శెట్టిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జూట్ బ్యాగుల పంపిణీ

కశింకోట: మండలంలోని బయ్యవరంలో ఉన్న సాగర్ సిమెంట్ యాజమాన్యం ప్రతినిధులు శెట్టిపాలెం (మాకవరపాలెం మండలం) ప్రాథమికోన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నిలిపివేయాలని, పర్యావరణహితమైన జూట్ సంచులు వినియోగించాలని సూచించారు. జూట్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేసి కాలుష్య రహిత భవిష్యత్ కోసం నడుం బిగిస్తామంటూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ అల్లు రాము నాయుడు ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సాగర్ సిమెంట్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీఎల్ ప్రవీణ, ఉపాధ్యాయులు జి.కరుణ, దేవి, సాగర్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెండు చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం, రిమాండ్



ముద్దాయిలతో పరవాడ సీఐ మల్లికార్జునరావు

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులకు సంబంధించి ఇరువురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆర్.మల్లికార్జున రావు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చోరీలకు పాల్పడిన అనంతపురం జిల్లా పెద్ద వడుగురు మండలం తేలికి గ్రామానికి చెందిన కోనాం రవితేజ, లంకెలపాలెం దరి గెంజిపేటకు చెందిన జామిశెట్టి కృష్ణచైతన్యలను లంకెలపాలెంలో సోమవారం అరెస్టు చేశామన్నారు. సీఐ తెలిపిన వివరాలు..

ఈ ఏడాది జూన్ 21న లంకెలపాలెం రామాలయం వీధికి చెందిన సూరిశెట్టి వెంకటలక్ష్మి, జూలై 12న లంకెలపాలెం దరి శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన దొంకాడ విమలకుమారి ఇళ్లలో నిందితులు చోరీలకు పాల్పడ్డారు. 10 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో సీఐ మల్లికార్జునరావు తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను లంకెలపాలెం ఐవోసీ బంకు వద్ద చాకచక్యంగా పట్టుకుని, వారి నుంచి 5.75 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులను స్వాధీనపర్చుకున్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐను, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, క్రైం అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఆరిపాక విద్యార్థులు



కళా ఉత్సవ్ పోటీల్లో విజేతలతో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని రామలక్ష్మి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో ఐదు విభాగాల్లో సత్తా చాటినట్లు పాఠశాల హెచ్ఎం ఎంజే రవీంద్రబాబు తెలిపారు. స్వదేశీ బొమ్మల తయారీ విభాగంలో కె.నీలవేణి, డి.దిలీప్ ప్రథమ బహుమతి, సాంప్రదాయ వాయిద్యం(సోలో)లో ఎస్ ప్రణీత, మూకాభినయంలో పి.జ్యోత్స్న, పి.హరీష్, జి.విజయ్‌కుమార్, షేక్ ఇస్మాయిల్ ద్వితీయ, సాంప్రదాయ కథల విభాగంలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ చెప్పిన చిద్విలాస్, గుణ గౌరీష్ తృతీయ, జానపద పాటల విభాగంలో వి.యోగిశ్రీ, వి.హరిణీకారుణ్య, జి.దీపిక, వి.మమత ప్రోత్సాహక బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు వచ్చే నెల విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు ఆయా విభాగాల్లో శిక్షణ అందించిన ఇంగ్లిష్ టీచర్ బీవీ రామలక్ష్మిని, విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యోగి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

బల్క్ డ్రగ్ పార్క్ నిర్వాసితులపై ప్రభుత్వ తీరు ఆక్షేపణీయం

అనకాపల్లి: నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసనలపై కూటమి ప్రభుత్వ ఉక్కుపాదం మోపడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును ధర్మవరంలో ఆయన స్వగృహంలో పోలీసులు గృహ నిర్బంధం చేయడం, మత్స్యకారులపై ఆంక్షలు విధించి, శాంతియుత పోరాటాన్ని అణచివేయాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాకతప్పదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని చెప్పిన టీడీపీ నాయకులు అధికారం చేపట్టగానే మాటమార్చడం సరికాదన్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌తో సముద్రంలో కాలుష్యం పెరిగి మత్స్య సంపద నాశనం అవుతుందన్నారు. ఫలితంగా వేలాది కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతారని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట ప్రజల పునరావాసం, జీవన భద్రతలను పక్కన పెట్టి, కార్పొరేట్ లాభాల కోసం మాత్రమే సీఎం చంద్రబాబు దృష్టి సారిస్తున్నారని ఆక్షేపించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువుకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారి అనిల్‌కుమార్

అనకాపల్లి: మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు మండల పశుసంవర్ధక శాఖ అధికారి సీహెచ్.అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలో మార్టూరు గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ వరకూ వ్యాక్సిన్లు వేస్తామన్నారు. పాడిరైతులు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఎగబడ్డ రైతులు



కొరుప్రోలు పీఏసీఎస్ వద్ద ఎగబడ్డ రైతులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో యూరియా వచ్చిన సమాచారం తెలుసుకుని పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. అదే సమయంలో కొందరు రైతులు యూరియాతోపాటు డీఏపీ, గ్రోమోర్ వంటి కాంప్లెక్స్ ఎరువులు ఎందుకు అందుబాటులో ఉంచడంలేదని వ్యవసాయాధికారి సౌజన్యను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల్లోనూ ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేవారని, ఇప్పుడు ఎందుకు కొనసాగించలేదని నిలదీశారు. గోకులపాడు, గెడ్డపాలెం, గుర్రాజుపేట తదితర గ్రామాల నుంచి ఎరువులు కోసం, అత్యవసరమైన యూరియా కోసం కొరుప్రోలు రావాల్సి వస్తుందని ప్రశ్నించారు. తీరా వచ్చాక ఇక్కడ అధికారులు వచ్చేవరకు సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షాలు ఆలస్యంగా కురిసి ఇబ్బందులు పడుతుంటే, ఎరువులు కొరత మరింత బాధిస్తుందన్నారు. ఏవో మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు కాంప్లెక్స్ ఎరువులు తీసుకువస్తామని, ప్రస్తుతం మండలంలో యూరియా కొరత లేదని చెప్పారు. పీఏసీఎస్ వద్ద రైతులు ఎగబడిన సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్‌బాబు అక్కడకు వచ్చి ఎరువులు గొడౌన్ తనిఖీ చేశారు. రైతులు క్యూ కట్టే పరిస్థితి లేకుండా ఎరువుల పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

ఆటో కార్మికుల రాష్ట్ర ధర్నాను జయప్రదం చేయండి

పరవాడ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 18న విజయవాడలో జరగనున్న ఆటో కార్మికుల రాష్ట్ర ధర్నా గోడ పత్రికను సోమవారం పరవాడలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ధర్నాలో అన్ని ప్రాంతాల ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పెంచిన ట్యాక్స్, పెనాల్టీలు, ఇన్సూరెన్స్‌లను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక యూనియన్ నాయకులు బలిరెడ్డి రమేష్, కె.సాయి, పి.ముని, వి.శ్రీను, వి.నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ భవనం కోసం పరిశీలన

పరవాడ: మండలంలో చిన్మయ గురుకులం గ్రామీణ వికాస కేంద్రం, ఎన్టీపీసీ సింహాద్రి సీఎస్సార్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో ఏర్పాటు చేయనున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్ర నిర్వహణకు అనువైన భవన సముదాయాలను సోమవారం పరిశీలించారు. గ్రామంలో 65 మంది మహిళలకు 6 నెలల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ కల్పించేందుకు సంస్థ ముందుకొచ్చింది. దీంతో సంబంధిత అధికారులు శిక్షణ కేంద్రానికి అనువైన స్థానిక ఎలిమెంటరీ పాఠశాల, మెట్టపాలెంలోని రైతు సేవా కేంద్రం భవనాలను పరిశీలించారు. పరిశీలనలో చిన్మయ మిషన్, ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ప్రతినిధులు శివం, ప్రకాశరావు, నాయుడుపాలెం సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కూండ్రపు సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.